ఫోన్ జోలికి వెళ్లొద్దు సారూ..

పాల్వంచ, న్యూస్‌టుడే



జిల్లాలో.. పాఠశాలలు: 1,665

ఉపాధ్యాయులు: 3,465

పాఠశాల నిర్వహణ, తరగతుల బోధన సమయాల్లో కొందరు ఉపాధ్యాయులు ఫోన్లను వినియోగిస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతుంది. పాఠం చెబుతున్నప్పుడు ఫోన్ మోగితే ఏకాగ్రత దెబ్బతింటుంది. ఈ పరిస్థితిని నియంత్రించాలని ప్రభుత్వం సంకల్పించింది. తరగతి గదుల్లోకి స్మార్ట్‌ఫోన్లు తీసుకెళ్లకుండా నిషేధించాలని ఇటీవల ఆదేశించింది. జిల్లా విద్యా శాఖాధికారులు ఉత్తర్వులను సైతం జారీ చేశారు. అయినా అవి పలుచోట్ల బేఖాతరవుతున్నాయి. తాజాగా ఓ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది.

తరగతి గదుల్లోకి ఫోన్లను నిషేధిస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీచేసినా.. కొన్ని పాఠశాలల్లో అవి మోత మోగుతూనే ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ పటిష్ఠం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల డీఈవోలు ప్రత్యేక దృష్టిసారించాలి. తరగతి గదికి వెళ్లే ముందు తమ ఫోన్లను ప్రధానోపాధ్యాయులకు అప్పగించాల్సి ఉంది. ఒకవేళ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలు ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే జారీ అయ్యాయి. తాజాగా కరకగూడెం మండలంలో ఓ ఉపాధ్యాయుడిని డీఈవో సస్పెండ్ చేశారు. ఇలాంటి ఘటనలు ముమ్ముందు పునరావృతం కాకుండా పర్యవేక్షణ పటిష్ఠపరచాలి.

★ 'విద్యాలయాల్లో ఫోన్ల వినియోగాన్ని నిషేధించాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం. దీన్ని కొందరు పెడచెవిన పెడుతున్నారు. విద్యార్థుల ముఖ హాజరు నమోదును మొదటి పిరియడ్‌లో పూర్తిచేయాలి. ట్యాబ్‌లను నిబంధనల ప్రకారమే వాడాలి. ఇకపై ప్రధానోపాధ్యాయులు ఫోన్లను తమ వద్దే పెట్టుకోవాలి'.

-వెంకటేశ్వరాచారి, డీఈఓ

ఎకో బ్రిక్స్ తయారీకి కలెక్టర్ పిలుపు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ - స్వచ్ఛతా హీ సేవా 2024' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఎకో బ్రిక్స్ తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శనివారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు ఎక్కువ మొత్తంలో ఎకో బ్రిక్స్‌లను ఈ నెల 30వ తేదీలోగా తయారు చేయించాలని ఆదేశించారు. వాటి చిత్రాలను డీఆర్‌డీఓ కార్యాలయానికి సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని.. ఎక్కువ మొత్తంలో బ్రిక్స్ తయారు చేయించిన కార్యదర్శులకు అక్టోబరు 1న కలెక్టరేట్‌లో సన్మానం చేసి, జ్ఞాపికను బహూకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.




ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

కరకగూడెం, న్యూస్‌టుడే: కరకగూడెం మండలం శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చందులాల్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తరగతి గదిలో చరవాణి మాట్లాడుతున్నారని సోషల్ మీడియాలో ఆరోపణలు రావడంతో డీఈఓ విచారణ చేపట్టారు. ఇది నిజమేనని తేలింది. ఈ విషయమై ఎంఈఓ మంజులను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తరగతి గదిలో ఉపాధ్యాయుడు చరవాణి వాడడంతో డీఈఓ సస్పెండ్ చేశారని, ఉత్తర్వులిచ్చారని చెప్పారు.

మీకు తెలుసా?

గుండె గుప్పెడంత.. ఒత్తిడి ఉప్పెనంత!

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



గుండె లయతప్పుతోంది. ముఖ్యంగా యువత, టీనేజర్లలోనూ గుండెపోటుతో కుప్పకూలుతున్న ఘటనలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఎక్కువయ్యాయి. ఇక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిలో అత్యధికులు హృద్రోగాలతో సతమతం అవుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. కరోనా అనంతర పరిణామాల తర్వాత చోటుచేసుకున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లలోని మార్పులు.. గుండె జబ్బులు పెరిగేందుకు కారణమవుతున్నాయి. వ్యాయామం, ఆరోగ్యం పట్ల కనీస శ్రద్ధ, ముందస్తు పరీక్షలు మేలని వైద్యులు సూచిస్తున్నారు.

- కొత్తగూడెం పట్టణం, ఖమ్మం వైద్య విభాగం, న్యూస్‌టుడే

● కనీస వ్యాయామానికి మహిళల్లో 57%, పురుషుల్లో 43% మంది దూరంగా ఉంటున్నారు.

● అసలు శారీరక శ్రమ అనేది తెలియని యువత 31% శాతం పైగా ఉన్నారు.

● ఖమ్మం సర్వజన ఆసుపత్రి గుండె వైద్య నిపుణుల విభాగాన్ని 2021-2024 (ఇప్పటి వరకు) మధ్య 20,994 మంది సంప్రదించారు. వీరితో కలిపి మొత్తం 2డీ ఎకో పరీక్షలను 28,374 మంది చేయించుకున్నారు.



ఖమ్మం ఆస్పత్రిలోని హృద్రోగ చికిత్సల విభాగం

అంతా.. అరచేతుల్లోనే..

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధచూపుతున్న వారు 'గుండె' లయను అదుపులో ఉంచుకునే సాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా తమ బరువును అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మై ఫిట్‌నెస్‌పాల్, హార్ట్‌వాచ్ (ఐఓఎస్), వియర్ ఓఎస్ బై గూగుల్, కార్డియో, కార్డియో హార్ట్ హెల్త్, ఫిట్‌బిట్, ఆపిల్ హెల్త్, బ్లడ్ ప్రెజర్ కంపానియన్, లైఫ్‌సమ్ వంటి యాప్‌లతో గుండె లయ, నాడీ పనితీరును పరిశీలించుకుంటున్నామని ఖమ్మం, కొత్తగూడెంకు చెందిన పలువురు యువకులు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. ఆరోగ్యం కోసం నిత్యం మైదానాలకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

మరోవైపు.. హార్ట్‌రేట్ మానిటర్, ఫిట్‌నెస్ ట్రాకర్, పోర్టబుల్ ఈసీజీ, స్మార్ట్‌బ్లడ్ ప్రెజర్, హార్ట్‌రేట్ మానిటర్లు, ఆక్సీమీటర్లు, ధరించదగిన హోల్టర్ మానిటర్లు, స్లీప్ ట్రాకర్ల వినియోగంతో పాటు.. ఆన్‌లైన్ కొనుగోళ్లకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వైద్య రంగ విపణి వేదికగా నిలుస్తోంది. వీటికి డిమాండ్ ఏటేటా పెరుగుతోంది. యాప్‌లు, ఉపకరణాల సాయంతో రక్తపోటు, బరువు, హృదయ స్పందన రేటును రికార్డు చేసుకోవడం, తేడా గమనిస్తే వైద్య నిపుణులను సంప్రదిస్తున్నట్లు నడకసాధకులు తెలిపారు.



★ 'నేను గత కొద్దినెలలుగా ఉదయం, లేదా సాయంత్రం వేళలో ప్రకాశం మైదానానికి నడకకు వెళ్తాను. ఆహార నియంత్రణ, నిద్ర సరిగా ఉండేలా చూసుకుంటాను. యాప్‌ల సాయంతో ఆరోగ్య సంరక్షణను సరిచూసుకుంటాను' అని కొత్తగూడెంకు చెందిన 39 ఏళ్ల **చిదుముల సతీశ్** అన్నారు.



★ గత ఐదేళ్లుగా నడక సాధన చేస్తున్న మరో యువకుడు **సత్యప్రసాద్** మాట్లాడుతూ.. 'గుండె పనితీరు దెబ్బతినకుండా ఉండేందుకు నిర్దిష్ట లక్ష్యంతో నడక సాధన చేస్తాను. ఈ సమయంలో స్మార్ట్ వాచ్ సాంకేతికత సద్వినియోగం చేసుకుంటాను' అని చెప్పారు.



ఫాస్ట్‌ఫుడ్, చక్కెర పానీయాలు వంటి అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు గుండె భద్రతకు ప్రమాదకరం. పొగాకు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. జన్యు కారణాలతో పాటు అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై నియంత్రణ కొనసాగిస్తూ.. రాత్రిళ్లు కనీసం ఏడు గంటలు నిద్రించాలి. లేదంటే.. గుప్పెడు గుండెపై ఒత్తిడి పెరిగి సమస్యలొస్తాయి. వ్యాయామంతో జబ్బులకు దూరంగా ఉండాలి.

- డా.ఎ.పుష్పలత, ఎండీ జనరల్ ఫిజీషియన్

ఆదివారం ప్రత్యేకం

హృద్రోగ చికిత్సలు ఇలా.. (ఈ ఏడాది సెప్టెంబర్ 28 వరకు)

	కార్డియోథొరాఫిక్ సర్జరీ (భద్రాద్రి)	కార్డియోథొరాఫిక్ సర్జరీ (ఖమ్మం)	కార్డియాలజీ చికిత్సలు (భద్రాద్రి)	కార్డియాలజీ చికిత్సలు (ఖమ్మం)
2023	239	442	672	1211
2024	408	244	1063	685

లోక్ అదాలత్‌లో 4,313 కేసులు పరిష్కారం

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 4,313 కేసులు పరిష్కారమయ్యాయి. అపరిష్కృతంగా ఉన్న కేసులను రాజీమార్గంలో కక్షిదారులు పరిష్కరించుకున్నారు. కొత్తగూడెంలోని వివిధ కోర్టుల్లో 2,351, మణుగూరు 275, దమ్మపేట 259, భద్రాచలం 820, ఇల్లెందు 608 కేసులు పరిష్కారమయ్యాయి. కొత్తగూడెంలో ఎస్‌బీఐ వారు కక్షిదారులకు పులిహోర, తాగునీరు ఏర్పాటు చేశారు. ఓ రోడ్డు ప్రమాద కేసులో రూ.73 లక్షలకు పైగా నష్టపరిహారాన్ని బాధితులకు అందజేశారు. అంతకు ముందు కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'న్యాయ చైతన్య సదస్సు' జరిగింది. జిల్లా జడ్జి పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. రాజీమార్గంలో కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ సమావేశంలో న్యాయమూర్తి జి.భానుమతి, బి.రామారావు, కె.సాయిశ్రీ, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జోనల్ స్థాయి పోటీలు

కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే: భద్రాద్రి జోనల్ స్థాయి 'ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్-2024'ను ఆది, సోమవారాల్లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్నట్లు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డి.భీమానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన జిల్లా, క్షేత్రస్థాయి అధికారులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

30న 'ఇన్‌స్పైర్' నమూనాలపై శిక్షణ

పాల్వంచ, న్యూస్‌టుడే: 'ఇన్‌స్పైర్ మనాక్-2024' నమూనాల అప్‌లోడ్‌పై అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 30న కొత్తగూడెం ఆనందఖని పాఠశాలలో శిక్షణ, సమావేశం ఉంటుందని డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గైర్హాజరు అయితే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

పంచాయతీ ఓటర్లు @6,23,947

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో 21 మండలాల వారీగా పంచాయతీ ఓటర్ల తుది జాబితా శనివారం ఖరారైంది. అంతకు ముందు ముసాయిదా జాబితా ప్రచురించిన అధికారులు.. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం వాటిపై జిల్లా, మండల స్థాయిలో రాజకీయ ప్రజాప్రతినిధులు, నాయకులతో చర్చించారు. అభ్యంతరాలను 26న పరిష్కరించారు. మొత్తం 479 పంచాయతీల్లోని 4,232 వార్డుల్లో 6,23,947 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 3,04,264, మహిళలు 3,19,660, ఇతరులు 23 మంది ఉన్నారని జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి తెలిపారు.

మండలం	పురుషులు	మహిళలు
ఆళ్లపల్లి	4,554	4,541
అన్నపురెడ్డిపల్లి	8,246	8,381
అశ్వాపురం	15,945	16,963
అశ్వారావుపేట	22,654	23,964
బూర్గంపాడు	14,999	15,715
చండ్రుగొండ	11,517	11,980
చర్ల	15,342	16,572
చుంచుపల్లి	18,884	19,895
దమ్మపేట	21,046	22,789
దుమ్ముగూడెం	17,100	18,908
గుండాల	6,492	6,453
జూలూరుపాడు	13,521	14,056
కరకగూడెం	6,331	6,366
లక్ష్మీదేవిపల్లి	15,559	16,233
మణుగూరు	17,800	18,156
ములకలపల్లి	13,573	14,059
పాల్వంచ	13,735	14,655
పినపాక	13,049	13,836
సుజాతనగర్	11,263	11,636
టేకులపల్లి	20,298	20,770
ఇల్లెందు	22,356	23,732

రూ.450 కోట్లతో జంట పట్టణాలకు రింగ్‌రోడ్డు: కూనంనేని

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రూ.450 కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మాణానికి రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించినట్లు వెల్లడించారు. పురపాలకంలోని పలు వార్డుల్లో డీఎంఎఫ్ నిధులు రూ.4.50 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీ రహదారులు, పార్కుల నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపనలు చేశారు. కొత్తగూడెం మీదుగా బైపాస్ రోడ్డు వరకు రూ.2 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు పాత కొత్తగూడెంలో శంకుస్థాపన చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుపైనా అధికార యంత్రాంగం ప్రక్రియను ప్రారంభించిందన్నారు. ఛైర్‌పర్సన్ కె.సీతాలక్ష్మి, కౌన్సిలర్లు, తహసీల్దారు పుల్లయ్య, కమిషనర్ శేషు, షేక్ సాబీర్‌పాషా పాల్గొన్నారు.

పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 2024-25 విద్యా సంవత్సరం అర్హులైన ఎస్సీ విద్యార్థులు పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి దాసరి అనసూర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా 'ఈ-పాస్' వెబ్‌సైట్‌లో మార్పులు చేసినట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థి మెమోలో ఉన్న విధంగా ఆధార్‌కార్డులో వివరాలు ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలు ఉండాలన్నారు.

ఆర్థో శస్త్రచికిత్సలకు సీహెచ్‌సీ సిద్ధం


పాల్వంచ వైద్య విభాగం, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉండే పాల్వంచలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) వైద్య సేవలపరంగా కీలక భూమిక పోషిస్తోంది. జాతీయ రహదారితో పాటు జిల్లాలోని పలు ప్రధాన మార్గాలకు అనుసంధానమై ఉండటంతో సీహెచ్‌సీకి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కేటీపీఎస్, ఎన్ఎండీసీ, సింగరేణితో పాటు పలు కర్మాగారాలు, క్వారీల్లో పని చేసే వారు, వాహనదారులు ప్రమాదాల బారినపడితే అత్యవసర చికిత్సకు తరలించేది తొలుత సీహెచ్‌సీకే. ఈ క్రమంలో ట్రామా విభాగంలో మెరుగైన వైద్య సేవలందించేందుకు తాజాగా పలు పరికరాలు అందుబాటులోకి వచ్చాయి.

సీహెచ్‌సీలో రోజుకు ఓపీ 500 వరకు ఉంటుంది. ఇన్ పేషంట్లుగా చేరే క్షతగాత్రుల్లో అత్యధికులు ఎముకలు విరగడం, ఛాతీ వద్ద గాయాలైన వారే ఉంటున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఇన్నాళ్లూ తగిన ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులో లేవు. కేవలం సాధారణ ల్యాబ్‌లో ఎక్స్-రే తీసి.. ప్రాథమిక స్థాయి వైద్యం చేసేవారు. ఈ నేపథ్యంలో సుమారు రూ.20 లక్షల విలువైన యంత్ర, శస్త్రచికిత్సల పరికరాలను సీఎస్సార్ పథకం కింద కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'గెయిల్ సంస్థ'(గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా) సీహెచ్‌సీకి సమకూర్చింది. వీటిలో బాయిల్స్ మెషిన్, సక్షన్ ఆపరేటర్స్, ఫుల్లీ ఎలెక్ట్రానిక్ ఆర్థోపెడిక్ టేబుల్, బయోపారామానిటరింగ్, ఓటీ సీలింగ్ లైట్స్ తదితర ఆర్థో పరికరాలు, ఫర్నిచర్ ఉన్నాయి.



ఆసుపత్రిలో బిగించిన ఆధునిక పరికరాలు




ఆసుపత్రికి 'గెయిల్' సంస్థ పరికరాలు సమకూర్చింది. వీటితో రోగ నిర్ధారణ, కొన్ని శస్త్రచికిత్సలు నిర్వహించుకునే వెసులుబాటు కలిగింది. సీ-ఆర్మ్, డిజిటల్ ఎక్స్-రే యంత్రాలను ఎమ్మెల్యే కోటా నుంచి మంజూరు కానున్నాయి. కేసులు రిఫర్ చేయకుడా ఇక్కడే ఆర్థో సేవలందిస్తాం.'

- రాంప్రసాద్, సూపరింటెండెంట్

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.






సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

గురువర్యా.. మీకిది తగునా?



కూసుమంచి, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

తల్లిదండ్రుల తర్వాత ఆ స్థానంలో నిలిచి.. దైవ సమానంగా పూజలందుకునే కొందరు గురువుల ప్రవర్తన పవిత్ర వృత్తికి మచ్చతెస్తోంది. పిల్లలను విద్యాబుద్ధులతో సన్మార్గంలో నడిపించాల్సిన వారిలో కొందరు వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో తరచూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉండటం బాధాకరం.

తాజాగా వైరా మండలంలో ఓ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవరించిన ఘటనపై కేసు నమోదైంది. ఇది ఉభయ జిల్లాల్లో తొలి ఘటనైతే కాదు. గతంలో పలు ఉదంతాల్లో సస్పెండ్‌కు గురైన సందర్భాలనేకం ఉన్నాయి..

☆ తిరుమలాయపాలెం మండలంలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒకరు గతంలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తల్లిదండ్రులకు చిక్కాడు. వారి చేతిలో దేహశుద్ధి చేయించుకుని చివరకు సస్పెండ్ అయ్యాడు. పలు ఘటనల్లోనూ ఆయన ప్రవర్తన వివాదాస్పదమైంది. సస్పెండ్ తర్వాత బుద్ధిమార్చుకోకపోగా.. తిరిగి విధుల్లో చేరాక కూడా ఓ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులంటూ విద్యార్థినుల పట్ల వక్రబుద్ధి ప్రదర్శించాడు. మళ్లీ ఆయనపై వేటుపడటం కొసమెరుపు.

☆ కూసుమంచి మండలంలోని ఓ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పదో తరగతి విద్యార్థినిని పొరుగు జిల్లా కేంద్రంలోని లాడ్జికి తీసుకెళ్లి అడ్డంగా దొరికిపోయాడు.

☆ ఇల్లెందులోని సింగరేణి ఎయిడెడ్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనతో అధికారులు శాఖాపరమైన చర్యల్లో భాగంగా బదిలీ వేటు వేశారు.

☆ టేకులపల్లి మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో మరో టీచర్ పదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.

☆ కొణిజర్ల సమీపంలోని ఒక గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడు బాలికతో అసభ్యంగా వ్యవహరించాడు. దీంతో అధికారులు ఆయన్ను ఉద్యోగంలోంచి తొలగించారు.

☆ కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రంలో ఓ ఆర్ట్ టీచర్‌పైనా కలెక్టర్ ఆదేశాలతో కొద్దిరోజుల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో ఆయన హెచ్.ఎం. అండతో విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు విచారణాధికారి విచారణలో తేలింది.

'విద్యార్థినులతో ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం. కొద్ది రోజుల్లో ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తాం. తొలుత ఉపాధ్యాయులకు, ఆ తర్వాత బాలబాలికలకు విడివిడిగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయినులతో కమిటీ ఏర్పాటుచేసి బాలికల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం. ఫిర్యాదుల పెట్టె ఏర్పాటుచేసి, రెండు రోజులకోసారి దాన్ని తెరిచేలా చూస్తాం.'

- సోమశేఖర్‌శర్మ, ఖమ్మం డీఈఓ.

'ప్రసాద్' పనులను సకాలంలో పూర్తి చేయండి

☆ టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి

భద్రాచలం, ఖమ్మం క్రీడలు, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసాద్ పథకాన్ని నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. రెండేళ్ల కిందట రాష్ట్రపతి ద్రౌపదీముర్ము భద్రాచలం పర్యటనలో ప్రసాద్ పథకం పనులకు శంకుస్థాపన చేశారు. భద్రాచలం, పర్ణశాలలో కలిపి రూ.42 కోట్లతో పథకం పనులు కొనసాగుతున్నాయి. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, రామాలయం ఈఓ రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావుతో కలిసి వీటిని ఎండీ శనివారం పరిశీలించారు. డిసెంబరు కల్లా పనులు పూర్తయితే కొత్త పనులకు నిధులు వచ్చే వీలుందని వెల్లడించారు. రామయ్యను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆదివాసీ కళా చిత్రాన్ని ఎండీకి కలెక్టర్ బహూకరించారు.

☆ ఖమ్మం ఖిల్లాపై ఏర్పాటు చేయనున్న రోప్ వేకు అవసరమైన అంశాలను పర్యాటక ఎండీ ప్రకాష్‌రెడ్డి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులతో కలిసి శనివారం పరిశలించారు. ఖాళీ ప్రదేశం నుంచి రోప్ వెళ్లేలా చూస్తున్నామని అధికారులు ఆయనకు వివరించారు.

☆ కిన్నెరసాని పర్యాటక కేంద్రం పరిధిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అద్దాల మేడ, కాటేజీలు తదితర పనులను కలెక్టర్ ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. డిసెంబరు 1 నాటికి పనులు పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు. జలాశయంలో బోటుపై ఆయన విహరించారు.



టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డికి ఆదివాసీ కళా చిత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పక్కన పీఓ రాహుల్, ఈఓ రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావు

సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

☆ ప్రశాంతంగా డీసీసీబీ మహాజన సభ



వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబును సన్మానించిన డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, పక్కనే డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని డీసీసీబీ సమావేశం మందిరంలో శనివారం జరిగిన 125వ మహాజన సభలో మాట్లాడారు. మోటాపురం సొసైటీ అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ.. రుణమాఫీ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. సమగ్ర ఆడిట్ నివేదికను బయట పెట్టాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. మంచుకొండ సహకార సంఘం అధ్యక్షుడు మందడపు సుధాకర్, పోచారం సొసైటీ అధ్యక్షుడు అంజయ్య, ఆంధ్రాబ్యాంకు కర్షక సేవా సమితి అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి రుణమాఫీ, పలు కీలక అంశాలు లేవనెత్తారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, సీఈఓ వసంతరావు, మార్క్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా మేనేజర్ సునిత, ఏడీఏ వాసవీరాణి, పాలకవర్గ సభ్యులు, సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ సొసైటీ అధ్యక్షులను బ్యాంకు ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సన్మానించారు.

బాలురు.. గంజాయి తరలిస్తూ దొరికారు..!

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: సీలేరు డొంకరాయి నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు మైనర్లను పట్టణ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వివరాల్లోకెళితే.. విజయవాడకు చిట్టినగర్‌కు చెందిన పదిహేడేళ్ల లోపు ఇద్దరు బాలురు చదువు బంద్ చేశారు. జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బు కోసం గంజాయి వ్యాపారానికి దిగారు. డొంకరాయిలో సరకు కొనుగోలు చేసి విజయవాడకు శనివారం స్కూటీపై బయల్దేరి వెళ్తుండగా.. పట్టణ అదనపు ఎస్సై రాఘవయ్య జీసీసీ ఎదురుగా చేపట్టిన తనిఖీల్లో వీరిని పట్టుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఐదు రోజుల్లో.. 57.21 కిలోలు..

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఖమ్మం ఆబ్కారీ ఎన్‌ఫోర్సుమెంట్ బృందం వరుసగా ఐదు రోజుల్లో భద్రాచలం, పాల్వంచ, మణుగూరు ప్రాంతాల్లో దాడులు చేసి 57.21 కిలోల గంజాయి పట్టుకుంది. గత నాలుగు రోజుల్లో 14 మంది వద్ద 43.18 కిలోల గంజాయి దొరకగా.. శనివారం స్థానిక కూనవరం రోడ్‌లో ఐదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న మరో 14.03 కిలోల సరకు లభ్యమైంది. వారందరినీ పోలీసులు అరెస్టు చేశారు. దాడుల్లో సీఐ శ్రీనివాస్, కరీం, బాలు, భద్రాచలం సీఐ రహీమున్నిసాబేగం తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి అభివృద్ధికి సాంకేతిక తోడ్పాటు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న సీడీబీ ఉప సంచాలకులు కుమార్‌వేల్

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: కొబ్బరి తోటల పెంపకంలో సాంకేతిక అంశాలకు కొబ్బరి అభివృద్ధి బోర్డు పూర్తి తోడ్పాటు అందిస్తుందని సీడీబీ ఉప సంచాలకులు కుమార్‌వేల్ పేర్కొన్నారు. కొబ్బరి బోర్డు- ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఆరు రోజుల పాటు కొబ్బరి వృక్ష మిత్రులకు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. కుమార్‌వేల్ మాట్లాడుతూ గతేడాది కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా తెలంగాణకు ఈ ఏడాది రూ.65లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వ్యవసాయ కళాశాల ఏడీ హేమంత్‌కుమార్, ఆచార్యులు శిరీష, ఐవీఎస్ రెడ్డి, గోపాలకృష్ణమూర్తి, సీడీబీ క్షేత్ర అధికారి సురేష్ పాల్గొన్నారు. అశ్వారావుపేట, గంగారం పరిసరాల్లోని కొబ్బరితోటలను కుమార్‌వేల్ సందర్శించారు.

ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర్‌శర్మ

వైరా, న్యూస్‌టుడే: విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ తల్లిదండ్రులు ఆందోళన చేసిన సంఘటన వైరా మండలం పాలడుగు ఉన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. హెచ్.ఎం. చావా శ్రీనివాసరావు కొందరు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులు ధ్వజమెత్తారు. వారంతా పాఠశాలకు వస్తున్నంతలోనే సదరు హెచ్.ఎం. బయటికి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాఠశాలకు చేరుకున్నాడు. ఆయన్ను, ఇతర ఉపాధ్యాయులను ఓ గదిలో నిర్బంధించిన బంధువులు అక్కడే బైఠాయించారు. దీంతో డీఈవో సోమశేఖర్‌శర్మ, వైరా సీఐ సాగర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడారు. వారికి నచ్చజెప్పారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చావా శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సదరు హెచ్.ఎం. గతంలో బోనకల్ మండలంలో పనిచేసే సమయంలో వివాదాస్పద నిర్ణయాలతో సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఘనంగా రాములోరికి స్వర్ణ తులసీ దళార్చన

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. బంగారు తులసి పూజలను ఘనంగా కొనసాగించారు. పసిడితో తయారుచేసిన తులసీ దళాలను సీతారాముడి పాదాల చెంత వద్ద ఉంచి అర్చన చేశారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. మాంగల్యధారణ రమణీయంగా నిలిచింది. తలంబ్రాల వేడుక అమితానందాన్ని అందించగా, దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన పూజ చేశారు. పవళింపు సేవ లేదు. ఆదివారం అభిషేకంతో పాటు బంగారు పుష్పార్చన ఉంటుందని తెలిపారు.

పంచాయతీ కార్మికుని ఆత్మహత్య



ములకలపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన పొడియం నారాయణ(57) సీతారాంపురం పంచాయతీ కార్మికునిగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటికి సమీపంలోని పశువుల కొష్టం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, పనిమానేస్తే కుటుంబపోషణకు ఇబ్బంది పడాల్సి వస్తుందని బాధపడేవాడిని మృతుని కుమారుడు రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నారాయణ ఆత్మహత్యకు పనిఒత్తిడి, పంచాయతీ అధికారులే కారణమంటూ శనివారం స్థానిక వాట్సప్ గ్రూపులలో ప్రచారం సాగింది. మృతదేహం వద్ద పోలీసులు ఒక లేఖను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పనుల విషయమై అధికారులు ఒత్తిడికి గురిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు బాధిత కుటుంబసభ్యులతో రాజీ ప్రయత్నాలు నెరిపినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వైరా, న్యూస్‌టుడే: వైరా మధిర రోడ్డుకు చెందిన చెరుకుమల్లి సీతయ్య(42) శనివారం ఉదయం తన ఇంటి ముందు నీళ్లు చల్లుతున్న క్రమంలో పక్కనే ఉన్న ఓ దుకాణానికి చెందిన బోర్డును పట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆయనకు సీపీఆర్ చేసి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి స్వస్థలం కొణిజర్ల మండలం చిన్నమునగాల. దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని బంధువులు ఆందోళన చేశారు. వైరా ఎస్సై భాగ్యరాజు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

అక్రమంగా తరలించిన బాణసంచా పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో భారీగా బాణసంచా అక్రమ నిల్వలను పట్టణ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. త్వరలో దీపావళి నేపథ్యంలో తమిళనాడు నుంచి లారీలో వచ్చిన సరకును భద్రాచలం ఇండస్ట్రియల్ ఏరియాలోని గోదాంలో దిగుమతి చేస్తుండగా.. పట్టణ సీఐ సంజీవరావు, పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. బిల్లు ప్రకారం రూ. 8లక్షల విలువైన 80 కార్టన్ల సరకు ఉన్నట్లు సమాచారం. నలుగురు వ్యక్తులు కలిసి సరకును కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాణసంచాను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.

చికెన్ ధరలు: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

రసాభాసగా అశ్వారావుపేట మండల కాంగ్రెస్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశం రసాభాసగా సాగింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు, తిట్లు, శాపనార్థాలతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సారథ్యంలో సమావేశాన్ని అశ్వారావుపేటలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఒకవర్గానికి పెత్తనం ఇస్తూ తమను అణగదొక్కుతున్నారని మొగళ్లపు చెన్నకేశవరావు వర్గీయులు ఆరోపించారు... భారాస, ఇతర పార్టీల వారికి పెద్దపీట వేస్తున్నారని జూపల్లి రమేష్ ఆరోపించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాదులాట, ఎదురుదాడి, మాటల్లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో ఏమిచేయాలో అర్థంకాక కొద్దిసేపు జారే ఆదినారాయణ మౌనంగా ఉండిపోయారు. ఈ దశలో ఎస్ఐ యయాతి రాజు, పోలీసు సిబ్బంది పార్టీ కార్యకర్తలను సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. దీంతో జారే సమావేశంలో అల్లరి చేయడం తగదు, మౌనంగా ఉండలేకపోతే ఉండకుండా బయటకు వెళ్లిపోవాలనడంతో కార్యకర్తలు తగ్గారు. జారే మాట్లాడుతూ తనకు వర్గాలతో పనిలేదని, ఎవరొచ్చినా పనిచేసి పెడతానని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అయిదు హామీలను అమలు పరిచిందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది కార్యకర్తలేనన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

దమ్మపేట, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి కాంగ్రెస్ సత్తా చాటాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. దమ్మపేటలో శనివారం నిర్వహించిన మండల పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరకాలంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. దమ్మపేట మార్కెట్ కమిటీ పదవి కాంగ్రెస్‌కు చెందిన నాయకుడికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. మండల పార్టీ సమావేశానికి కీలకమైన తుమ్మల వర్గ నాయకులు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. మార్కెట్ కమిటీ పదవిని తమ వర్గానికి చెందిన ఓ నాయకుడికి కేటాయిస్తామని మంత్రి సమక్షంలో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే జారే తరువాత మాట మార్చారని వారు ఆరోపించారు. దీంతో వర్గపోరు మారోమారు బహిర్గతమైంది.

రహదారి ఏర్పాటుపై వివాదం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: తూరుబాక గ్రామ సమీపంలో మళ్లింపురహదారి నిర్మాణంపై శనివారం వివాదం నెలకొంది. ఇటీవలి వర్షాలకు గ్రామ సమీపంలో కల్వర్టు దెబ్బతింది. దానికి మరమ్మతులు చేపట్టేందుకు డైవర్షన్ రోడ్డు నిర్మాణం చేపట్టగా కొందరు గ్రామస్థులు తమ భూమిలోంచి రోడ్డు వేయవద్దని అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. తహసీల్దార్ అశోక్‌కుమార్, గిర్దావర్ వెంకటేశ్వరరావు వచ్చి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: భద్రాచలంలోని చర్ల రోడ్ యామిజాలనగర్ మూడో వీధిలో విద్యుత్ దీపాలు లేక రాత్రిళ్లు స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. **- ముత్తయ్య, భద్రాచలం**

సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు సంబంధిత లైన్ ఉందో లేదో పరిశీలించి తగు ఏర్పాట్లు చేయిస్తాం. **- సీహెచ్ శ్రీనివాసరావు, భద్రాచలం పంచాయతీ ఈఓ**

– భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆదాయం కోల్పోతున్నా పట్టింపేది..?

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే



భద్రాచలంలోని ఓ కాలనీలో ఇసుక

తెలంగాణలోకి గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తోలకాలు సాగుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అటు మైనింగ్ అధికారులు, ఇటు పట్టణ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఖనిజ సంపద రాష్ట్ర సరిహద్దు దాటితే మైనింగ్ శాఖకు ఆ సరకును బట్టి రుసుం చెల్లించిన తర్వాతే రాష్ట్రంలోకి అనుమతిస్తారు. దీనిని బట్టి ఒక్కో లారీకి సుమారు రూ.5 వేల వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

★ సరిహద్దు రాష్ట్రాల నుంచి తెల్లరాయి, ఇసుక వంటి ఖనిజ సంపదను తెచ్చే వారి నుంచి నిబంధనల ప్రకారం రుసుం వసూలు చేసేందుకు పట్టణ శివారులో ఓ కార్యాలయం (కంటెయినర్) ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆంధ్రా నుంచి భద్రాచలం పట్టణంలోకి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో సరిహద్దు ఏపీ ప్రాంతం నుంచి గోదావరి ఇసుక యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది. భద్రాచలంలో ఎక్కడ చూసినా ఇసుక గుట్టలే దర్శనమిస్తున్నాయి.

★ ఇదిలా ఉండగా ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాలలో రెండు రోజుల కిందట ఏర్పాటు చేసిన ర్యాంపు నుంచి రాత్రికి రాత్రి ఇసుక లారీలు తోలకాలు ఆరంభించాయి. ఏపీ నుంచి తెలంగాణ మీదుగా సరకు తీసుకెళితే ఏలాంటి రుసుం చెల్లించడం లేదు. ఇప్పటికే ఇసుక వ్యాపారంలో ఆరితేరిన కొందరు ఇదే అదనుగా అధికారులను మచ్చిక చేసుకొని టిప్పర్లతో భద్రాచలం పట్టణంలోకి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. పట్టణంలోని ఇసుక నిల్వలపై దృష్టి సారిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి.

★ దీనిపై మైనింగ్ శాఖ అధికారి దినేష్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి



ప్రసంగిస్తున్న ఇన్‌ఛార్జి డీఐఈఓ సులోచనారాణి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఇన్‌ఛార్జి డీఐఈఓ బి.సులోచనారాణి కోరారు. దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాలలో పూర్వ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే చక్కటి ఉత్తీర్ణతను సాధించి కళాశాలకు మంచి పేరు తేవడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తహసీల్దార్ అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ సీహెచ్.కృష్ణవేణి, అధ్యాపకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల కన్నుమూత

పినపాక, న్యూస్‌టుడే: ఇద్దరు నవజాత శిశువులు మృతి చెందిన సంఘటన పినపాక మండలం మద్దులగూడెం గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రసాద్-మరియమ్మ దంపతుల మూడో సంతానమైన రెండు నెలల చిన్నారి రెండు రోజులుగా జలుబుతో బాధ పడుతోంది. దీంతో కుటుంబసభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం సమయంలో మృతి చెందింది. ఇదే గ్రామానికి చెందిన ఇరపా మహేశ్-మంజు దంపతుల మొదటి సంతానంగా కుమారుడు జన్మించాడు. రెండు నెలల వయసున్న ఈ బాలుడు వారం రోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడంతో తొలుత మణుగూరు ఆసుపత్రికి అక్కడి నుంచి భద్రాచలం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయినా నయం కాకపోవడంతో కొత్తగూడెం తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వస్తున్న తరుణంలో మార్గమధ్యలో చిన్నారి మృతి చెందాడు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు ఒకే రోజు మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

శిలాఫలకంతోనే సరా..?



అన్నపురెడ్డిపల్లి జడ్పీ పాఠశాల పక్కన ఉన్న స్థలంలో రూ.18 కోట్ల అంచనా వ్యయంతో భారాస ప్రభుత్వ హయాంలో నూతన గిరిజన బాలుర వసతిగృహం నిర్మాణానికి 2016లో మార్చి 14న శంఖుస్థాపన చేశారు. నేటికీ పనులు చేపట్టకపోవడంతో అది శిలాఫలకానికే పరిమితమైంది. వసతిగృహాన్ని పక్కనే ఉన్న పాత భవనంలోనే చాలీచాలని గదుల్లోనే కొనసాగిస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి శిలాఫలకం వేసి ఎనిమిదేళ్లయినా ఎవరూ పట్టించుకోవట్లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే

పేరుకే ఆనంద(పుర)ం



ఊరుంది. ఊరికో బోర్డుంది. కానీ ఆ బోర్డు మీద ఊరి పేరే లేదు. రాద్దామనుకున్నా వీలు కాదు. ఆ అవకాశం లేదు. బోర్డుపై ఉన్న రేకు ఊడిపోయింది. కేవలం చుట్టూ ఫ్రేం మాత్రమే మిగిలింది.. ఆనందాపురం గ్రామం మొదట్లో ఉన్న బోర్డు ఇది. పాడై పూర్తిగా శిథిల దశకు చేరుకుంది. గ్రామం పేరులోని 'ఆ' అనే అక్షరం మాత్రమే మిగిలింది. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి వేణుప్రియను 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా... వారం రోజుల్లో కొత్త బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

– అశ్వాపురం, న్యూస్‌టుడే

పంచాయతీకి ఆదాయం సమకూరేలా చర్యలు



పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని గ్రామ పంచాయతీకి ఆదాయం వనరులు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. స్థానికంగా యూబీ రోడ్‌లోని అసంపూర్తిగా ఉన్న పంచాయతీకి చెందిన భవనాన్ని పీఓ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భవన నిర్మాణం పూర్తిచేసి దుకాణ సముదాయం వంటివి ఏర్పాటు చేస్తే అద్దెల రూపంలో పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం చర్ల రోడ్, జగదీష్ కాలనీలోని వరదల సమయంలో దెబ్బతిన్న మురుగు కాలువలు, సైడ్ వాల్స్‌ను పరిశీలించి నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఈఓ సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లో తుది ఓటరు జాబితా ప్రదర్శన

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితా పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో 105 పంచాయతీల్లో ఓటరు జాబితాను శనివారం ఉంచారు. అభ్యంతరాలుంటే తెలపొచ్చని స్థానిక పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు.

వైద్య సేవలపై ఇమ్యూనైజేషన్ అధికారి ఆరా

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బాలాజీనాయక్ శనివారం సందర్శించారు. ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఐఎల్ఆర్ రూంలో టీకాలు భద్రపరిచే విధానాన్ని తనిఖీ చేశారు. కట్టుగూడెంలో వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు చేశారు.

'పాలకుల వైఫల్యాలను ఎండగట్టాలి'

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకులు ఇచ్చిన హామీలు అమలులో వైఫల్యాలను ఎండగట్టినప్పుడే వారి అసమర్థత ప్రజలకు తెలుస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పిట్టల అర్జున్ అన్నారు. శనివారం తిరుమలకుంటలో ఆ పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల అమలులో విఫలమైందని విమర్శించారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన డీఆర్‌డీవో

చండ్రుగొండ: మండలం రావికంపాడులో ఈజీఎస్ ద్వారా చేపట్టిన సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని శనివారం భద్రాద్రి కొత్తగూడెం డీఆర్‌డీవో విద్యాచందన సందర్శించారు. ఈజీఎస్ నిధులతో సాగు చేస్తున్న మునగతోటను, అంతర పంటలను పరిశీలించి రైతు కోటయ్యను అభినందించారు.

'నెల్లిపాక పీఏసీఎస్‌పై తప్పుడు ప్రచారం తగదు'

అశ్వాపురం, న్యూస్‌టుడే: నెల్లిపాక పీఏసీఎస్‌పై తప్పుడు ప్రచారం తగదని అధ్యక్షుడు తుక్కాని మధుసూదనరెడ్డి, పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. మొండికుంటలోని ఆ సంఘం కార్యాలయంలో వారు శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 26న మహాజన సభ కోరం పూర్తి కానందున తిరిగి అక్టోబర్ 17న మహాజన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి

మణుగూరు సాంస్కృతికం: సింగరేణి గనులతోపాటు పలు విభాగాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరుతూ తెబొగకాసం ఆధ్వర్యంలో శనివారం మణుగూరు ఏరియాలోని కార్యాలయాల వద్ద సంతకాల సేకరణ చేపట్టారు.

ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రతను పాటించండి

గుండాల, న్యూస్‌టుడే: పరిశుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని జిల్లా పరిషత్ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన గుండాలలో పర్యటించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా సాగింది. మండల వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: రేబిస్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. అశ్వారావుపేట పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు.

భద్రాచలం పట్టణం: ప్రపంచ రేబిస్ దినం సందర్భంగా ఆ వ్యాధి రాకుండా భద్రాచలం పశువైద్యశాలలో శనివారం ఉచితంగా టీకాలు వేశారు. పశువైద్యాధికారి పురంధర్, సహాయసంచాలకులు రాగూర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల మనుగడకు 30న నిరాహార దీక్ష

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఆదివాసీల మనుగడ కోసం ఈనెల 30న ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ తెలిపారు. ఐటీడీఏ ఆవరణలో సున్నం సుబ్బయ్య అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఆదివాసీల హక్కులు, భూ సమస్యల పరిష్కారంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఏజెన్సీ చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాయం సన్యాసి, కారం సుధ, లక్ష్మి, నాగమణి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

జాక్టో ఉపాధ్యాయుల నిరసన

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండుతో జాక్టో ఆధ్వర్యంలో మారాయిగూడెం ప్రాథమిక పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణపై తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన జీవో నంబర్ 25 సవరించాలని డిమాండు చేశారు. జయబాబు, హనుమంతరావు, ఆదినారాయణ, రమేష్, సత్యప్రసాద్, కాంతారావు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: రైతులు పండించే పంటలకు స్వామినాథన్ కమీషన్ సిఫారసు మేరకు మద్దతు ధర ప్రకటించాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కాటాయిగూడెం, మహదేవపురం, నారాయణరావుపేట గ్రామాల్లో సీపీఎం గ్రామశాఖ మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తూతూమంత్రంగా మద్దతు ధరలు ప్రకటిస్తోందని విమర్శించారు. ఉత్పత్తి ఖర్చుకి అదనంగా 50శాతం కలిపి మద్దతు ధర ప్రకటిస్తేనే రైతులకు గిట్టుబాటవుతుందన్నారు. రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, వ్యవసాయంపై చేసిన బంగారు రుణాలను పరిగణలోకి తీసుకోవాలని, రైతు బంధు సొమ్ము రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సీపీఎం నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, వంశీ, చంద్రయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

'పొంగులేటిపై భారాస, భాజపా కుట్ర'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై జరిగిన ఈడీ దాడులు భారాస, భాజపా కుట్రలో భాగమేనని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రధాని మోదీ మధ్యలో కుదిరిన ఒప్పందంలో భాగంగానే పొంగులేటిపై ఈడీ దాడులు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అత్యధిక శాతం ప్రతిపక్షాల మీదనే దాడులు జరుగుతున్నాయని, కేవలం రాజకీయ లబ్ధి పొందడం కోసమే అక్రమ కేసులు పెడుతున్న భాజపా నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించినట్లు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. రాజీ పడిన కక్షిదారులు ఇద్దరూ గెలిచినట్లేనని అన్నారు. వారి సమయం వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. బ్యాంకు, చిట్‌ఫండ్, ఇతర వివిధ కేసుల్లో రూ. 81.53 లక్షలకు చెందిన సమస్యలు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, ఏపీపీ శ్రీనివాస్, సీఐ సంజీవరావు, కోర్టు సిబ్బంది న్యాయవాదులు పాల్గొన్నారు.



కేసుల తీర్పు ప్రతులను అందజేస్తున్న న్యాయమూర్తి, సీఐ, న్యాయవాదులు

వినాయకపురంలో గుప్తనిధుల తవ్వకాల కలకలం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట మండలం వినాయకపురంలో గుప్తనిధుల తవ్వకాలు కలకలం రేపాయి. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లపు అనంతశేషు ఇంటికి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న అతని మేనత్త రామినేని రోజా రాణి మూడు రోజుల క్రితం వెళ్లింది. మేనత్తను ఇంట్లో ఉంచి అనంతశేషు రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని ఆలయాల దర్శనానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. ఈ క్రమంలో రోజారాణి శనివారం హైదరాబాద్‌కు చెందిన కొందరిని పిలిపించి ఇంట్లో క్షుద్ర పూజలు చేయిస్తూ తవ్వకాలు జరపటంతో చుట్టుపక్కల వారు భయాందోళలకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి తవ్వకాలు జరుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారికి చెందిన ఖరీదైన స్కోడా కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మరో ముగ్గురు పారిపోయారని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మరమ్మతులకు గురైన జనరేటర్ తరలింపు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని బీటీపీఎస్‌లో ఇటీవల ఏర్పడిన అగ్నిప్రమాదం కారణంగా అక్కడున్న ఓ భారీ జనరేటర్‌కు మంటలు వ్యాపించి మరమ్మతులకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ జనరేటర్‌ను జెన్‌కో అధికారులు శనివారం 58 టైర్ల భారీ వాహనం ద్వారా చెన్నైకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం పట్టణంలోకి చేరుకున్న ఆ వాహనం కారణంగా ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వెంటనే పోలీసు సిబ్బంది స్పందించి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తూ జనరేటర్ ఉన్న వాహనాన్ని ముందుకు పంపించారు.



సీఆర్పీఎఫ్ క్యాంపులో గిరిజన మహిళకు వైద్యం

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలంలోని కలివేరులో గిరిజన మహిళ పొడియం రామలక్ష్మికి శనివారం సరైన సమయంలో వైద్య సేవలు అందించి సీఆర్పీఎఫ్ అధికారులు ఆమె ప్రాణాలు కాపాడారు. గ్రామానికి చెందిన రామలక్ష్మి ఇంటి భవనంపై నుంచి జారీ పడటంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమెను హుటాహుటిన గ్రామంలోని సీఆర్పీఎఫ్ 151 క్యాంపులోని ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి నీరజ్‌పాండే, సిబ్బంది చికిత్సలు చేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. ప్రజలకు అన్నివిధాలా సేవలు అందించేందుకు సీఆర్పీఎఫ్ సన్నద్ధంగా ఉంటుందని వైద్యాధికారి నీరజ్ పాండే ఈ సందర్భంగా తెలిపారు.

డివిజన్ స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న బాలికలకు, 30న బాలురకు ఎంపికలు జరుగుతాయన్నారు. డివిజన్లవారీగా ఉదయం 9లోపు ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది మధ్య శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా ఇరువర్గాలపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

జూద స్థావరంపై దాడి

దమ్మపేట, న్యూస్‌టుడే: మండలంలోని గట్టుగూడెంలో నిర్వహిస్తున్న జూదస్థావరంపై ఎస్సై సాయికిషోర్‌రెడ్డి శనివారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.12,300 నగదు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారని ఎస్సై తెలిపారు.

కొండచిలువ హతం

అశ్వాపురం, న్యూస్‌టుడే: బట్టీలగుంపు గ్రామ పంచాయతీ పరిధిలోని పాయం జానకిరావు గుంపులో శనివారం ఓ కొండ చిలువ స్థానికుల చేతిలో హతమైంది.

నిధుల గోల్‌మాల్‌పై విచారణేది..?

చండ్రుగొండ, న్యూస్‌టుడే



చండ్రుగొండలోని ఐకేపీ కార్యాలయం

రాష్ట్రీయ మహిళా కోష్ నిధులపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపకపోవటంతో నిధులు గోల్‌మాల్ అయ్యాయా... వసూలు చేసిన నిధులు కాజేశారా.. అనే అంశంలో నేటికీ సందిగ్ధత నెలకొంది. వివరాలను పరిశీలిస్తే.. చండ్రుగొండ మండలం మహాలక్ష్మి మహిళా సమాఖ్యకు 2005-06లో దిల్లీలోని రాష్ట్రీయ మహిళా కోష్ రూ.50 లక్షలు రుణం ఇచ్చింది. ఈ నిధులు మండలంలోని 23 గ్రామ సమాఖ్యలకు రుణాలుగా అందజేశారు. తీసుకున్న రుణాలు నెలనెల తిరిగి చెల్లించాల్సి ఉందని సభ్యులకు తెలిపారు. 2010 వరకు క్రమం తప్పకుండా గ్రామ సమాఖ్యలు మండల సమాఖ్యకు తిరిగి చెల్లించాయి. రూ.37 లక్షలు వసూలు చేసి దిల్లీలోని రాష్ట్రీయ మహిళా కోష్‌కు జమచేశారు. అనంతరం రూ.13లక్షలు చెల్లించాల్సి ఉంది. 2011 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రీయ మహిళా కోష్‌కు పైసా చెల్లించలేదు. దీంతో వడ్డీపై వడ్డీ కలిపి రూ.13 లక్షలు కాస్తా రూ.45లక్షలు అయ్యాయి. గ్రామ సమాఖ్యలు తీసుకున్న డబ్బులు చెల్లించినట్లు పేర్కొంటుండగా.. రూ.13 లక్షలు ఏమైయ్యాయన్న విషయం తేలడంలేదు.


★ దిల్లీలోని రాష్ట్రీయ మహిళా కోష్ దగ్గర అప్పటి మండల సమాఖ్య అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మ, కోశాధికారి కాంతకుమారిలు చెక్కులపై సంతకాలు చేసి రుణాలు తీసుకురావటంతో వారిద్దరికే నోటీసులు వస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో రుణాలిచ్చినవారు కోర్టులో కేసు వేశారు. దిల్లీ నుంచి డబ్బుల రికవరీకి పలుమార్లు పోలీసులు వచ్చి పోతున్నారు. తనకు చదువు రాదని, సంతకాలు చేయమంటే చేశానని.. ఇలా జరుగుతుందని తనకు తెలియదని మండల సమాఖ్య అధ్యక్షురాలు సీతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులపై జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి రూ.13 లక్షలు ఏమయ్యాయో తేల్చాలని పలువురు కోరుతున్నారు.

★ దీనిపై ప్రస్తుత ఏపీఎం సంతోష్‌ని వివరణ కోరగా 2011 నుంచి గ్రామ సమాఖ్యల నుంచి రికవరీ అయినట్లు రికార్డుల్లో లేవన్నారు. గ్రామ సమాఖ్యల వారిని అడిగితే ఎప్పుడో చెల్లించామని చెబుతున్నారని తెలిపారు. ఈ అంశాన్ని డీఆర్‌డీవోకు తెలియజేస్తానన్నారు.

జీసీసీకి రెగ్యులర్ డీఎం వచ్చేనా..!

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం జీసీసీకి రెగ్యులర్ డీఎం నియామకం చేయాల్సిన అవసరం ఏర్పడింది. కొద్ది నెలలుగా ఇక్కడ ఇంఛార్జి డివిజనల్ మేనేజర్‌గా ఉన్న బి.దావీదు ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, దమ్మపేట, భద్రాచలం గిరిజన సహకార సంస్థ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటిని ఆయా మేనేజర్లు నిర్వహిస్తున్నారు. ఇందులో మణుగూరు సీనియర్ మేనేజరే భద్రాచలం జీసీసీ ఇంఛార్జి డీఎం హోదాలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు పోస్టుల భర్తీ తక్షణ కర్తవ్యంగా మారింది. భద్రాచలం, ఉట్నూరు, ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలోని జీసీసీ సీనియర్ మేనేజర్లకు ఇక్కడ డీఎం హోదా కల్పిస్తారా లేక గతంలో ఇక్కడ విధులు నిర్వహించి హైదరాబాద్‌లో పని చేస్తున్న వారిని తిరిగి భద్రాచలం పంపిస్తారా అన్నది తెలియాల్సి ఉంది. గిరిజన సహకార సంస్థల్లో అన్ని క్యాడర్లలో 170 మంది వరకు పని చేస్తుండగా మరో 50 పోస్టులు నింపాల్సి ఉంది.



జీసీసీ డీఎం కార్యాలయం

సేల్స్‌మెన్ వ్యవస్థ బలోపేతమైతేనే..

ఈ ఏడాది జీసీసీ లక్ష్యం రూ.191.72 కోట్లు ఉండగా ఆగస్టు వరకు రూ.40.72 కోట్లను సాధించడమే గగనమైంది. అటవీ ఫలాలను సేకరించాలంటే క్షేత్ర స్థాయిలోని 149 చౌక దుకాణాలలో విధులు నిర్వహిస్తున్న సేల్స్‌మెన్‌లకు దిశా నిర్దేశం చేస్తుండాలి. అడవుల నుంచి గిరిజనులు సేకరించిన జిగురు, కొండ చీపుర్లు, ముష్టి గింజలు వంటి వాటిని తక్షణం సరైన ధర చెల్లించి జీసీసీ కొనాలి. ఆ తర్వాత వీటిని గోదాములకు తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించగలిగితే లాభాలకు కొదవే ఉండదు. అన్నింటికీ మించి గతంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి. పెట్రోల్ బంకుల నిర్వహణపై రోజువారీ నివేదికలను తీసుకోగలిగితే జీసీసీకి గత వైభవం వస్తుందని సీనియర్ ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

ఉభయ జిల్లాల క్రీడా జట్ల ఎంపికలు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: అక్టోబర్ 1న ఉభయ ఖమ్మం జిల్లాల క్రికెట్, ఫుట్‌బాల్, రెజ్లింగ్ పాఠశాల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించడం జరుగుతోందని భద్రాద్రి కొత్తగూడెం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్-14 బాలుర క్రికెట్ ఎంపికలు, అండర్-17 బాలుర ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు కొత్తగూడెం పట్టణం ప్రకాశం మైదానం ఉంటుందన్నారు. కొత్తగూడెం ప్రగతి మైదానం అండర్-14 17, 19 బాలబాలికల రెజ్లింగ్ క్రీడా ఎంపికలు ఉంటుందన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు విద్యాలయాల స్టడీసర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి బార్కుల మెమోతో రావాలన్నారు.

అనుమతులులేని వెంచర్లలో హెచ్చరిక బోర్డులు

సుజాతనగర్, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసిన స్థలాల్లో సుజాతనగర్ పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు, ఆర్ఐ బాబురావులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వెంచర్లలో ఇళ్ల స్థలాలు కొనుగోలుదారులు అనుమతులున్నాయా? లేవా? సక్రమంగా ఉన్నాయా? అన్నది నిర్ధారించుకున్న తర్వాతనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: పాల్వంచ పట్టణం గాంధీనగర్‌కాలనీలో డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. పిచ్చిమొక్కలు పెరిగాయి. **- రాజు, స్థానికుడు**

సమాధానం: సంబంధిత ఏరియా జవాన్‌కు చెప్పి సమస్యలు పరిష్కరిస్తాం.
- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి
– పాల్వంచ, న్యూస్‌టుడే

✆ సుజాతనగర్ పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల శ్రీరాములు ఇంటి ఆవరణలో పదేళ్ల క్రితం ప్రభుత్వం చేతి పంపును ఏర్పాటు చేసింది. బోరును తమ ఇంటి ఆవరణ నుంచి తొలగించాలని కోరుతున్నారు. **- శ్రీరాములు కుటుంబ సభ్యులు**

✔ చేతిపంపును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇంటి ఆవరణలో ఎందుకు వేశారో వివరాలు సేకరించి, రైతుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం **- ఎంపీడీఓ భారతి**
– సుజాతనగర్, న్యూస్‌టుడే

‘భాజపా, భారాస ఒప్పందంతోనే ఈడీ దాడులు’



లక్ష్మీదేవిపల్లి: మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: భాజపా, భారాస లోపాయికారీ ఒప్పందంతోనే కక్ష సాధింపు చర్యగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యుల ఇళ్లపై ఈడీ దాడులు చేస్తోందని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ఆరోపించారు. మండలంలోని ఎదురుగడ్డలోని ఆయన ఇంటి వద్ద శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రాకుండా చూడాలని భాజపా కుట్ర చేస్తోందన్నారు. పొంగులేటిని రాజకీయంగా అణగదొక్కాలని ఆయన ఇంటిపై ఇప్పటికీ ఈడీ మూడో సారి దాడి చేసిందన్నారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆయనకు రాష్ట్ర ప్రజలు, కాంగ్రెస్ పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. ప్రధాని మోదీ గ్రాఫ్ పూర్తిగా తగ్గిందని ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ అధ్యక్షుడు కంచర్ల చంద్రశేఖర్‌రావు, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, అర్జునరావు, మోతుకూరి ధర్మారావు, ఆళ్ల మురళి, తూము చౌదరి, కాసుల వెంకట్, రజాక్, రాజేందర్, మసూద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసాలపై ఈడీ సోదాలు నిర్వహించడం భాజపా కుట్రలో భాగమేనని జడ్పీ మాజీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీపై కక్షపూరితంగానే మంత్రిని టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. విద్యానగర్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మేరెడ్డి జనార్దన్‌రెడ్డి, తూము చౌదరి, దేవి ప్రసన్న పాల్గొన్నారు.

ఈడీ దాడులపై కొత్వాల ఖండన: పాల్వంచ, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఈడీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడం తగదన్నారు. నాయకులు జానకిరెడ్డి, కొండం వెంకన్న, రామకృష్ణ, బాలినేని నాగేశ్వరరావు, కాపర్తి వెంకటాచారి, దొప్పులపూడి సురేశ్‌బాబు పాల్గొన్నారు.

పట్టాలెక్కని ప్రణాళికలు..

ఎమ్మెల్యే ఆదేశించి నెల రోజులు గడిచినా పురోగతి కరవు

కొత్తగూడెం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

సర్వజన ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించేందుకు కావాల్సిన నిధులున్నాయి. ప్రజాప్రతినిధి, జిల్లా ఉన్నతాధికారుల ఆమోదమూ ఉంది. కానీ ఇంచు పురోగతి ఉండటం లేదు. లోపం ఎక్కడ ఉందో అధికారులకే తెలియాలి. స్థానిక ప్రజాప్రతినిధి ఆదేశించి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇటుక పెడ్డ కదల్లేదు. కొద్ది నెలల క్రితం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వైద్యశాలను సందర్శించి ‘ప్రతిపాదనలు పంపించండి. సమస్యలు పరిష్కరిస్తామ’ని భరోసా ఇచ్చారు. ఆ వెంటనే స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పక్కా ప్రణాళికలతో దాదాపు రూ.1.36 కోట్లు నిధులు మంజూరు చేయించారు. తక్షణం పనులు ప్రారంభించాల్సిన ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, వైద్య శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిధులు ఖర్చు కాకపోవటంతో ఆసుపత్రి రోగులు, సహాయకులు, సిబ్బంది పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం దొరకటం లేదు.

‘వైద్యశాలలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మౌలిక సదుపాయాలు లేక ఇతరత్రా సమస్యలు పేరుకపోయాయి. ఆసుపత్రికి అభివృద్ధి నిధులు సిద్ధంగా ఉన్నాయి. జిల్లా ఆసుపత్రిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి తక్షణం ఏర్పాట్లు చేయాలి. ఇతర అభివృద్ధి పనులనూ తక్షణం వైద్య, పురపాలక, ఇంజినీరింగ్ అధికారులు ప్రారంభించాలి.’

-ఆగస్టు 4న, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన ఆదేశాల సారమిది..



ఆసుపత్రి ఆవరణలో నిలిచిన డ్రైనేజీ నీరు

సమస్యలు ఇలా..

- జిల్లా సర్వజన ఆసుపత్రిలో డ్రైనేజీ సదుపాయం లేకపోవటంతో శౌచాలయాల నుంచి వచ్చే మురుగు వ్యర్థాలు ఆవరణను కలుషితం చేస్తున్నాయి.
- అంతర్గతంగా సీసీ రోడ్డు లేదు. ఆవరణ గుంతలమయంగా మారి వర్షం నీరు నిల్వ ఉంటోంది. ఆసుపత్రి పరిసరాలే దోమల ఆవాసాలుగా మారుతున్నాయి.
- కొన్ని గదులు మరమ్మతులకు గురయ్యాయి.
- ఆసుపత్రిలో విద్యుత్తు సంబంధ సమస్యలున్నాయి.

నిధులు ఇలా...

★ భూగర్భ డ్రైనేజీ నిర్మాణం: రూ.48 లక్షలు
★ విద్యుత్ మరమ్మతులు: రూ.38 లక్షలు
★ డయాలసిస్ కేంద్రం, ఆపరేషన్, ఐసీయూ గదుల పూర్తి స్థాయి మరమ్మతులు, ఇతర సౌకర్యాల కల్పనకు: రూ.50 లక్షలు

‘డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం పెద్దల చొరవతోనే సాధ్యం. మేము చేసిన ప్రయత్నాలకు స్థానికులు అడ్డుపడ్డారు. నిధులు వచ్చిన విషయంపై నాకు స్పష్టమైన సమాచారం తెలియదు. సమస్య తీవ్రత పెరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం.’

- డాక్టర్ రాధామోహన్, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్

అభ్యంతరాలపై దరఖాస్తు చేసుకోవాలి: అదనపు కలెక్టర్



సందేహాలు నివృత్తి చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి ‘930 పీ’ విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న వారికి న్యాయమైన పరిహారం చెల్లించడం జరుగుతుందని, ఇంకా ఈ విషయమై అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. మండలం పరిధిలో భూనిర్వాసితులతో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. ఇల్లెందు మండలం సుదిమళ్ల రెవెన్యూ పంచాయతీ పరిధిలో 84 మంది భూ నిర్వాసితులు ఉండగా 24.39 ఎకరాలు జాతీయ రహదారిలో కోల్పోతున్నారు. వారికి ఎకరానికి రూ.18.81 లక్షల పరిహారం చెల్లించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. చల్లసముద్రం పరిధిలో 11 మంది నివాసాలను, రెండు గుంటల స్థలాన్ని కోల్పోతుండగా ఎకరాకు రూ.14.10 లక్షల పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు.

క్రీడలను విజయవంతం చేయాలి

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 29, 30 తేదీల్లో గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో నిర్వహించే పాల్వంచ, దమ్మపేట డివిజన్ స్థాయి గిరిజన క్రీడలను విజయవంతం చేయాలని దమ్మపేట ఏటీడీఓ చంద్రమోహన్ అన్నారు. శనివారం పాల్వంచలో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లా విద్యార్థులకు బహుమతులు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రాష్ట్రస్థాయి యువజన దినోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో శనివారం నిర్వహించిన 5కే రన్‌లో కొత్తగూడేనికి చెందిన విద్యార్థులకు బహుమతులు లభించాయి. సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మాలోతు ఇందుకు రూ.35 వేల బహుమతి, ప్రియదర్శిని కళాశాల విద్యార్థిని ఎం.అఖిల్‌కు రూ.25 వేల బహుమతి లభించినట్లు కోచ్ నరేష్ తెలిపారు.

వృత్తి శిక్షణ ముగింపు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి సెక్యూరిటీ గార్డులకు ప్రాథమిక చికిత్స, అగ్నిప్రమాదాల నివారణపై నిర్వహించిన వారం రోజుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. స్థానిక సెక్యూరిటీ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటైన ముగింపు కార్యక్రమంలో జీఎం సెక్యూరిటీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేర్చుకొన్న నైపుణ్యాలను సమర్థంగా వినియోగించాలన్నారు.

నేడు అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ ఉద్యోగాలకు రాతపరీక్ష

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: అంతర్గత అభ్యర్థుల ద్వారా అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ (ఎలక్ట్రీషియన్) ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రాతపరీక్ష నిర్వహించనున్నారు. 25 పోస్టులకుగాను 180 మంది దరఖాస్తు చేశారు. అందులో 170 మందికి యాజమాన్యం హాల్‌టిక్కెట్లను జారీ చేసింది. ఉదయం 10 నుంచి మ.12 గంటల దాకా రాతపరీక్ష ఉంటుంది.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి అన్నారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు అధిక సంఖ్యలో హమాలీలు రావాలని కోరుతూ పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. నాయకులు భిక్షం, రాజు, మల్లేశ్, సురేశ్, చరణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బది‘లీలల’పై చర్చ?

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: రెణ్నెల్ల క్రితం జరిగిన బదిలీల్లో నిబంధనలు ఉల్లంఘించిన మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులకు ఐటీడీఏ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వగా.. వారు సంజాయిషీ ఇచ్చారు. వారిపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారో అనే అంశం ఐటీడీఏ ఉపాధ్యాయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. నిబంధనల ప్రకారం ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీలు నిర్వహించారు. ఈ సమయంలో సదరు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తప్పుడు పత్రాలు అందించారని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఐటీడీఏ పీవో, డిప్యూటీ డైరెక్టర్ నుంచి వివరణ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ తప్పు జరిగినట్లు తేలి బాధ్యులపై చర్యలు చేపడితే.. ఆయా కేటగిరీలో ప్రాధాన్యతా క్రమం సైతం మారుతుంది. ‘విచారణ అంశం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం వెలువడలేదు’ అని ఇల్లెందు ఏటీడీఓ రాధమ్మ ‘న్యూస్‌టుడే’తో అన్నారు.

రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్టే

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: లోక్ అదాలత్‌లో రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్టేనని ఇల్లెందు న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. స్థానిక న్యాయస్థానంలో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. న్యాయవాదులు రవికుమార్, ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తిక్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఎల్ఈడీ తెర వితరణ

టేకులపల్లి, న్యూస్‌టుడే: సులానగర్ జడ్పీహెచ్ఎస్ పీడీగా పనిచేసే భూక్య మంజీలాల్ శనివారం తన అన్న కుమారుడు ప్రవీణ్‌రాథోడ్ జయంతిని పురస్కరించుకుని రాంపురం ప్రాథమిక పాఠశాలకు ఎల్ఈడీ తెరని వితరణ చేశారు. ఎంఈఓ జగన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, ప్రధానోపాధ్యాయుడు మోతీలాల్ పాల్గొన్నారు. మంజీలాల్‌ను ఎంఈఓ జగన్, ఉపాధ్యాయులు సన్మానించారు.

టోల్‌గేట్ ప్రతిపాదిత స్థలాన్ని మార్చాలని వినతి

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్ 930పీ నిర్మాణంలో భాగంగా సులానగర్ సమీపంలో ఏర్పాటు చేయనున్న టోల్‌గేట్‌ను సేద్యపు భూముల్లో కాకుండా ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని బాధిత రైతులు కోరారు. భూములు, ఇళ్లు కోల్పోయే బాధితులు శనివారం తహసీల్దార్ నాగభవానిని కలిసి వినతి పత్రం అందజేశారు.

✦ బోడురోడ్డులో జంక్షన్ పేరిట చేస్తున్న విస్తరణతో ప్రధాన హైవేకు ఎలాంటి సంబంధంలేని 11 ఇళ్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, డివైడర్ నుంచి రెండు వైపులా యాభై అడుగులు తీసి నష్టతీవ్రత తగ్గించాలని బోడు రోడ్డు గ్రామస్థులు శనివారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

‘కొండలరావు సేవలు మరువలేనివి’

జూలూరుపాడు, న్యూస్‌టుడే: పేదల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన కొండలరావు సేవలు మరువలేనివని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేశ్ అన్నారు. జూలూరుపాడులో సీపీఎం నాయకుడు యాసా కొండలరావు మూడో వర్ధంతి సభ శనివారం నిర్వహించారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: తిలక్‌నగర్ పంచాయతీ పరిధిలో జిల్లా పరిషత్ మోడల్ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో స్థానికులు శనివారం ఇల్లెందు-గుండాల రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సరిపోక 50 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారు అన్నారు. అబ్దుల్ నబి, సుల్తానా, భాగ్యలక్ష్మీ, శ్రీను, రోజ, సందీప్, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

పూడిక తీస్తే ఒట్టు.. కాలువల్లో ప్లాస్టిక్ తట్టు!



నిత్యం రద్దీగా ఉండే లేపాక్షి రోడ్‌లో డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. స్థానిక ఆంధ్రా బ్యాంకు (యూనియన్ బ్యాంక్) నుంచి రైతు బజార్ వరకు కాలువలో పూడిక పేరుకుపోయింది. అక్కడి మద్యం దుకాణాల్లో వాడిపడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్లు, ఖాళీ సీసాలను అడ్డగోలుగా పడేస్తున్నారు. వ్యర్థాల పారబోతకు అడ్డుకట్ట వేసి.. పూడికతీత చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి ‘న్యూస్‌టుడే’తో అన్నారు.
– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ప్రకటించాలి

పాల్వంచ, న్యూస్‌టుడే: భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. పాల్వంచ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. నాయకులు సాయిబాబా, పూర్ణచంద్రరావు, రాహుల్, పద్మజ, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ప్రభుత్వం భగత్‌సింగ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ నాయకులు బరిగెల భూపేష్, ఖయ్యూం డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని శనివారం రామవరంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. కార్యక్రమంలో మహేష్, రసూల్, నరేష్, అజయ్ పాల్గొన్నారు.

జీఓ నం.25ను సవరించాలి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు అశాస్త్రీయంగా జరిగాయని వెంటనే జీఓ నం.25ను సవరించాలని డిమాండ్ చేస్తూ ‘ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా కార్యదర్శి పద్మరాణి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రఘు, జి.హరిలాల్ మాట్లాడారు. బదిలీ అయినా రిలీవ్ చేయని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి, నూతన పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల హాజరు శాతం ప్రకారం సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరించాలని, బోధనేతర పనులు, పాఠశాలల పర్యవేక్షణ నిమిత్తం ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఇంగ్లీషు, తెలుగు మాధ్యమం ఉన్న పాఠశాలల్లో సబ్జెక్టులకు అనుగుణంగా వేర్వేరుగా పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ బి.రమాదేవిని కలిసి వినతిపత్రం అందించారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: సాయిరాంతండాకు చెందిన బానోత్ నరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1998-99 సంవత్సరంలో అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అతడి భార్య రుక్మిణీకి తమవంతుగా కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.38 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదినేని సతీశ్, పెండ్యాల నరేశ్, సిరిపురపు రాంబాబు, హలావత్ నరసింహారావు, కొలిపాక సురేశ్, ఎదులాపురం నరసింహారావు, పోలూరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహితుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న యువకులు

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయండి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్, జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ, ప్రభుత్వాసుపత్రులు, సింగరేణితోపాటు జిల్లాలోని వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ పద్మ, భూక్యా రమేష్, తాళ్లూరి కృష్ణ, నర్సింహా, వెంకటరెడ్డి, పాషా, నాగేశ్వరరావు, రమణ, అజయ్ కుమార్, రాములు, సుధాకర్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

✦ ములకలపల్లి మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ కార్మికుడు పోడియం నారాయణ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడని, అందుకు అధికారులే కారణమని, అతని మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ని కలిసి వినతిపత్రం అందించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడేందుకు హిందువులు, ధార్మిక సంస్థలు ముందుకు రావాలని ‘సనాతన హిందూ ధర్మ ఐక్యవేదిక’ సభ్యులు ఇంద్రగంటి శంకర ప్రసాదశర్మ పిలుపునిచ్చారు. కలియుగ వైకుంఠ దైవమైన తిరుపతి వెంకటేశ్వరస్వామి మహా ప్రసాదమైన లడ్డూను తయారు చేసే నెయ్యిని కల్తీ చేయడాన్ని నిరసిస్తూ శనివారం కొత్తగూడెం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన గణేష్ టెంపుల్ నుంచి ప్రారంభమై ఎంజీ రోడ్డు, త్రీ టౌన్ సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్, పోస్టాఫీసు సెంటర్ నుంచి విద్యానగర్ కాలనీలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ధార్మిక సంఘాలు, పట్టణంలోని హిందువులు, పురోహితులు, మహిళలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆర్డీఓని కలిసి వినతి పత్రం అందజేశారు. పి.వి.వర్ధనరావు, కృష్ణమూర్తి గురుస్వామి, కె.వి.రంగా కిరణ్, యెల్లండి పూర్ణచందర్‌రావు, కొదమసింహం పాండురంగాచార్యులు, దారా రమేష్, కొడమంచిలి రాధాకృష్ణ శర్మ, గుంటూరు రమాదేవి, నాగరాజు, దత్తాత్రేయ శర్మ, రామకృష్ణ, చింటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో సనాతన హిందూ ధర్మ ఐక్య వేదిక సభ్యులు

‘వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే తెలపండి’

చుంచుపల్లి, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం విద్యానగర్‌లో కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాఖ ఉద్యోగి నరేశ్ మాట్లాడుతూ వృద్ధులను వారి కుటుంబ సభ్యులు నిర్లక్ష్యం చేస్తే సమస్యను సంక్షేమ శాఖ దృష్టికి తెస్తే న్యాయం చేస్తామన్నారు. బ్యాంకులు, ఆసుపత్రుల వద్ద సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని సంఘం నాయకులు కోరారు. కొల్లు నాగేశ్వరరావు, సురేశ్‌కుమార్, బత్తుల కృష్ణయ్య, ప్రసన్న కుమార్, సందీప్, నరసింహారావు, పాండురంగారావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సంక్షేమ శాఖ ఉద్యోగి నరేశ్‌తో సీనియర్ సిటిజన్స్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో పురుగు మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జూలూరుపాడు మండలం దుబ్బతండాకు చెందిన భూక్యా బాలు(47) మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 27న మద్యం మత్తులో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సీసాతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: తాగిన మైకంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన నిందితుడిపై ఎస్సై సుమన్ కేసు నమోదు చేశారు. పాల్వంచలో ఓ మద్యం దుకాణంలో షేక్ షఫీ ఈనెల 27న రాత్రి మద్యం తాగుతుండగా మహేశ్ అనే వ్యక్తి వచ్చి అసభ్యపదజాలంతో దూషించి దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదుచేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు డీబ్లాక్ వద్ద అక్రమంగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని ఏఎస్సై ఘనీ విచారణ చేస్తున్నారు.


దుర్భాషలాడాడని ఫిర్యాదు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: పోచారంతండాకు చెందిన గ్రామీణ వైద్యుడు అఖిల్ వద్దకు శుక్రవారం భద్రుతండాకు చెందిన బానోత్ రమేష్ అనారోగ్యంతో ఉన్న తన కుమారుడిని తీసుకొచ్చాడు. వెంటనే చికిత్స చేయలేదనే కోపంతో తనను దుర్భాషలాడుతూ కొట్టినట్లు రమేష్‌పై అఖిల్ శనివారం కొమరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జింకల పార్కుకు 40 ఏళ్లు..!

14 నుంచి 260 హెక్టార్లకు విస్తరణ

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



పార్కులో దుప్పులు

పర్యాటకులను అలరిస్తున్న కిన్నెరసాని జింకల (డీర్) పార్కుకు 40 ఏళ్లు పూర్తయ్యాయి. 1974 సెప్టెంబర్ 29న ప్రారంభమైన పార్కు క్రమంగా విస్తరించింది. కిన్నెరసాని పార్కును సీఎం జలగం వెంగళరావు హయాంలో ప్రారంభించారు. అప్పట్లో 30 దుప్పులు ఉండేవి. వీటి సంఖ్య క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం దుప్పులు 137, మూషిక జింకలు 4, కొండగొర్రె ఒకటి పార్కులో సంచరిస్తున్నాయి. వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం లేకపోవడంతో పార్కు విస్తీర్ణం కాస్తా 260 హెక్టార్లకు పెంచారు. జూపాట్(కేంద్ర జూ అథారిటీ) బయోసాట్ పథకం కింద రూ.1.25 కోట్లు మంజూరయ్యాయి. దీంతో చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. సందర్శకుల కోసం జీపబుల్ ట్రాక్ నిర్మించనున్నారు. అది నిర్మిస్తే పర్యాటకులు ఎంచక్కా పార్కులో సంచరిస్తూ దుప్పులను అతి దగ్గర నుంచి చూసే అవకాశం ఉంది. దుప్పుల సంరక్షణకు స్థానికంగా ఉన్న సిబ్బంది మేత తీసుకొచ్చి వేస్తుంటారు. ప్రత్యేకంగా దాణా వేస్తూ సంరక్షిస్తున్నారు.

మూషిక జింకలు ప్రత్యేకం

దుప్పులతో పాటు మూషిక జింకలు ఆకట్టుకుంటున్నాయి. 2017లో వీటిని తీసుకొచ్చి పార్కులో వదిలారు. ప్రస్తుతం అవీ నాలుగు ఉన్నాయి. వీటికి స్థానిక అధికారులు క్యారెట్, బీట్‌రూట్ రోజూ పెడతారు. పర్యాటకుల సందర్శన నిమిత్తం నెమళ్లను పట్టుకొచ్చి కొద్దిరోజులు బోనులో పెట్టారు. అనంతరం విడిచిపెట్టడంతో ఎటో వెళ్లిపోయాయి. జనవాసాల్లోకి వచ్చి గాయపడిన దుప్పులు, కొండ గొర్రెలు కిన్నెరసానికి తీసుకొస్తారు. వీటికి వైద్యులు చికిత్స చేస్తారు. అటు కొలనులోనూ బాతులు 15, హంసలను పోలిన బాతులు 2 పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. వీటికి తోడు ఇటీవల కాలంలో రెండు కుందేళ్లను తీసుకొచ్చి పెంచుతున్నారు.